క్లుప్తంగా

హెల్త్ సూపర్‌వైజర్‌కు ఉత్తమ అవార్డు



వాజేడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న కోటిరెడ్డికి ఉత్తమ ఉద్యోగి అవార్డు వచ్చింది. జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నట్లు కోటిరెడ్డి తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలన విషయంలో చేసిన సేవలకు తనకు ఈ అవార్డు వచ్చిందని పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను సొంత పనులకు వాడుకుంటున్న సర్పంచ్

పలిమెల: మండలంలోని పంకెన గ్రామ సర్పంచ్ జీపీకి చెందిన ట్రాక్టర్‌ను తన సొంత పనులకు వాడుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే గ్రామపంచాయతీ సిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉన్నతాధికారులు స్పందించి సర్పంచ్‌పై చర్య తీసుకోవాలని కోరారు.

బాలుడిని కాటేసిన పాము

మహదేవపూర్: ఆడుకుంటున్న బాలుడి కాలుపై ప్రమాదవశాత్తు పాముకాటు వేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన దివ్య–శ్రీనివాసరావు దంపతుల కుమారుడు శ్రీయాన్ అద్వైత్ తన అమ్మమ్మ ఊరైన అంబట్‌పల్లికి వచ్చాడు. మధ్యాహ్నం వేళలో ఇంటి పెరటిలో ఆడుకుంటుండగా నీరుకట్ట పామును తొక్కగా పాము కాటువేసింది. గమనించిన బాలుడి తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాబుకు ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు.

‘ఆదర్శ’లో వార్షికోత్సవం



కాటారం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉత్సవ్–2023 పేరిట శనివారం నిర్వహించిన 33వ వార్షికోత్సవం అలరించాయి. విద్యార్థినీ,విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గతంలో ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో నిలిచిన పూర్వ విద్యార్థులను పాఠశాల యజమాన్యం శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాటారం డీఎస్పీ రాంమ్మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కృషి, పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం విద్యార్థులను ఉన్నత స్థానంలో ఉంచుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. వేడుకల్లో ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సీఐ రంజిత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ఎస్సై శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృషిత, డైరెక్టర్ కృష్ణచైతన్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

టేకుమట్ల(రేగొండ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మారి స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్టెంట్ పీయూ మేనేజర్ అక్కల రమేష్ అన్నారు. శనివారం రేగొండలోని వాణి విద్యానికేతన్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డబ్ల్యూ, డబ్ల్యూ, ఎఫ్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని 172 దేశాల్లో నిర్వహిస్తారని, శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 వరకు విద్యుత్ కాంతులను పూర్తిగా నిలిపివేస్తారని, భూగ్రహాన్ని కాపాడే విధంగా ప్రతీ ఒక్కరు సంఘీభావం తెలపాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో మారి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రొడ్యూసర్ యూనిట్ మేనేజర్ బత్తిని శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ గాజర్ల తిరుపతిగౌడ్, సుజాత, రమాదేవి, మౌనిక, దీప, చాంద్‌పాషా, శ్రీహరి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీ

- ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య

మంగపేట: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఎస్టీ సెల్(కాంగ్రెస్ పార్టీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆరోపించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గంపోనిగూడెం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై శనివారం ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నాను చెదరగొట్టారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు దేశప్రజల నుంచి వచ్చిన ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ కుట్ర పూరితంగా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిందని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఇదో చీకటి రోజు అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, కోడం బాలకృష్ణ, యానయ్య, ఆదినారాయణ, నరేందర్, కోడెల నరేష్, నర్సింహరావు, కాంతారావు, శ్యామ్‌లాల్, మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంపత్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చేయి విరగగా అతన్ని పరామర్శించారు.

ములుగు రూరల్(గోవిందరావుపేట): మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని అరెస్టు చేయడం సరికాదని గోవిందరావుపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాంనాయక్ అన్నారు. శనివారం అరెస్టుకు నిరసనగా జాతీయ రహదారిపై ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర ద్వారా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారన్న అక్కసుతో రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. దేశంలో నియంతృత్వ పాలన కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పీఏసీఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, జంపాల ప్రభాకర్, భూక్య సారయ్య, కణతల నాగేందర్‌రావు, హరిప్రసాద్, పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకుందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మండలంలోని తాళ్లపాడు సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యుడు మల్లాడీ రాంరెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ దోపిడీని, వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, మండ ల నాయకులు ఐలయ్య, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్, వీరేష్, ప్రభాకర్, సాంబయ్య, రహీముద్దిన్, రాజిరెడ్డి, పాల్గొన్నారు.



మంగపేట: ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ములుగు: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వెంకటాపురం(ఎం): మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యువత సన్మార్గంలో నడవాలి

- ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్

వాజేడు : యువత సన్మార్గంలో నడవాలని ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మండల పరిధిలోని పేరూరులో శనివారం సీఆర్‌పీఎఫ్ జి/39 ఆధ్వర్యంలో నిర్వహించిన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమీప గ్రామాల్లోని యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. వారితో కలిసి ఆయన ఆడారు. విజేతలకు టీ షర్టులు, షూస్ పంపిణీ చేశారు. వాటితో పాటు వాలీబాల్ కిట్లు, షటిల్ బ్యాట్లను యువకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు వైపు మళ్లకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. మావోయిస్టులకు సహకరించవద్దని హెచ్చరించారు. గ్రామాలను అభివృద్ధి పర్చుకునే విషయంతో పాటు గ్రామస్తులు అందరూ సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ఆర్‌కె పండా, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనీష్, ఇన్స్‌పెక్టర్ శంకర్ ఉన్నారు.



యువతకు కిట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ సంకీర్త్

తునికి పండ్లతో గొత్తికోయలకు ఉపాధి



అంబేడ్కర్ సెంటర్ వద్ద తునికి పండ్లు కొనుగోలు చేస్తున్న స్థానికులు

మంగపేట: మండలంలోని కమలాపురం అటవీ ప్రాంతంలో నివాసముంటున్న రేగులగూడెం గొత్తికోయ గిరిజన మహిళలు అటవీలో లభించే తునికి పండ్లు తీసుకొచ్చి కమలాపురంలో విక్రయిస్తూ తాత్కాలిక ఉపాధిని పొందుతున్నారు. ప్రతి ఏటా వేసవి కాలంలో మార్చి నుంచి మే నెల వరకు అటవీ ప్రాంతంలో లభించే తునికి, పాలపండ్లు, మొర్రి పండ్లను గొత్తికోయ గిరిజనులు కష్టపడి సేకరిస్తారు. వాటిని తీసుకొచ్చి మండలంలోని కమలాపురం, మంగపేట, రాజుపేటలో విక్రయించి వాటి ద్వారా వచ్చే డబ్బులతో వారి ఆర్థిక అవసరాలు తీర్చుకుంటారు. ప్రకృతిలో లభించే ఆయా పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉండటంతో స్థానికులు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతారు. ప్రస్తుతం కమలాపురంలో తునికి పండ్లు అరకేజీ డబ్బా రూ.30కి విక్రయిస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఒక రోజంతా చెట్టు పుట్ట తిరిగి ఎంతో కష్టపడి తునికి పండ్లు సేకరిస్తారు. మరుసటి రోజు సుమారు 5 కిలోమీటర్ల దూరం కాలినడకన వాటిని నెత్తిపై మోసుకుని వచ్చి విక్రయిస్తారు. అయినప్పటికీ అడవి తల్లిని నమ్ముకుని జీవనం సాగించే గొత్తికోయ గిరిజనులు ప్రకృతి ప్రసాదించే ఫలాల ద్వారా కొద్దిరోజులు మాత్రమే లభించే పండ్ల ద్వారా ఎంతో కొంత ఉపాధి లభించడం వచ్చే ఆదాయంతో నిత్యావసర సరుకులు, బట్టలు ఇతర ఖర్చులకు వినియోగించి తమ అవసరాలు తీర్చుకుంటామని చెపుతున్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

ఏటూరునాగారం: జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లోని వంటషెడ్డు, తరగతి గదులు, వంట చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి, పేద విద్యార్థులకు గొప్ప విద్య అందజేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నో కార్యక్రమాలను ఏర్పాటు చేసి మెరుగైన విద్య అందించాలన్నారు. అలాగే మన ఊరు– మన బడిలో జరుగుతున్న పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



వంట నాణ్యతను పరిశీలిస్తున్న జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పాక భాస్కర్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తాడ్వాయి క్లస్టర్ పాక భాస్కర్, సునంద అన్నారు. రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో విద్స్ సంస్థ ద్వారా శనివారం మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్‌నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాంకు ద్వారా అందించే కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, బ్యాంకు సేవలు, పొదుపులు, సులభతరమైన డిజిటల్ లావాదేవిల విధానాలు, ఏటీఎం కార్డు ఉపయోగం, వివిధ రకాల విద్యా, వ్యాపార రుణాలు, సబ్సిడీ రుణాలపై వివరించారు. బ్యాంకులో సిబిల్ స్కోర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న లబ్దిదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, కాల్షియం, విటమిన్ల లోపాలను నివారించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు.

తిమ్మాపురంలో వైద్య శిబిరం

బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని 35 మందికి సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ మౌనిక, ఏఎన్ఎం అరుణ, సీతారావమ్మ, ఆశా కార్యకర్తలు రాణి, పూలమ్మ, సులోచన, నాగమణి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

బాల్య వివాహాలపై అవగాహన



గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎస్సై అశోక్

వాజేడు: మండల పరిధిలోని చింతూరులో శనివారం వాజేడు ఎస్సై రేఖ అశోక్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు బాల్యవివాహాలు, బాల కార్మికులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడంతో తలెత్తే సమస్యలు, చట్టపరంగా ఎదుర్కోవాల్సిన ఇబ్బందులను వివరించారు. 14 సంవత్సరాలు నిండ కుండా ఎవరినైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలను తీసుకూంటామని హెచ్చరించారు. 5 నుంచి 14 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరిని బడిలో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలను జారీ చేశారు. ఏ సమస్య ఉన్నా నేరుగా పోలీసులతో మాట్లాడవచ్చని తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న హెచ్‌ఎం రమేష్

ఎస్ఎస్‌తాడ్వాయి : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని హెచ్‌ఎం రమేష్ అన్నారు. పోషణపక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఊరట్టం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ కిషోర బాలికలు త్వరగా జీర్ణమయ్యే చిరుధాన్యాలను తీసుకోవడంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సోషల్ వర్కర్ జ్యోతి మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవడానికి జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలన్నారు. బాలలు తమ హక్కులకు భంగం వాటిల్లితే 1098 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మండలంలోని నార్లాపూర్ పాఠశాలలో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎం రేగ కేశవరావు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

రామప్ప దేవాలయంలో విద్యార్థుల సందడి



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో శనివారం విద్యార్థులు, పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వేలాది సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ విజయ్ కుమార్, వెంకటేష్‌లు వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తం చేశారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి ఫోటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సు కట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను వీక్షించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

ములుగు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చుంచు రమేష్ అన్నారు. మండలంలోని దేవగిరిపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందించారు. ఈ మేరకు ములుగు, నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించిన లయన్స్‌క్లబ్ వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ముక్కు సుబ్బారెడ్డి, మేరుగు రమేష్, కొండి సాంబశివ, సానికొమ్ము రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాలల హక్కులను రక్షించాలి

భూపాలపల్లి రూరల్: బాలల హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, వీసీపీసీల సమర్థ నిర్వహణతోనే బాలల హక్కులను రక్షించవచ్చని స్థానిక ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సమస్యలు సంబంధిత చట్టాలపై గ్రామ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలోని బాలల సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కృషి చేసేలా కార్యదర్శులు చూడాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, బడి మానేసిన బాలలు, బాలలపై వేధింపులు, మత్తు పదార్థాలకు బానిసయ్యే బాలలు, పౌష్టికాహార లోపంతో బాధపడే బాలలులేని గ్రామాలుగా ప్రతీ గ్రామాన్ని తీర్చిదిద్దేలా చూడాలని కార్యదర్శులకు పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మండల, జిల్లా కమిటీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ డీసీపీఓ వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనలో గ్రామ కార్యదర్శులే కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటేష్, డీసీపీయూ సోషల్ వర్కర్ శైలజ, అధికారులు కుమార్, సువర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్‌కుమార్

ఘనంగా భోగ్ బండారో వేడుకలు



సేవాలాల్ మహారాజ్‌కు భోగ్ బండారో సమర్పిస్తున్న బంజారాలు

ములుగు రూరల్(గోవిందరావుపేట) : బంజారలు సంస్కృతి, సంప్రదాయాల మేరకు సేవాలాల్ మహా రాజ్‌కు భోగ్ బండారో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం గోవిందరావుపేట మండలం పస్రాలో భూక్య సుమలత–సక్రునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా మేరమా యాడికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. కులదైవాలకు బోగ్ బండారో సమర్పించడం జాతి సమైక్యతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మున్నా నాయక్, రాజునాయక్, సేత్య, బిక్యా, రాములు, సమ్మయ్య, చందర్, అక్షయ్, నవదీప్, భద్రమ్మ, బాజు, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి సహకరించాలి

కాటారం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, ఎంపీపీ పంతంకాని సమ్మయ్య అన్నారు. పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శనివారం నారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం ద్వారా రైతులకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సంఘం నిధులు, ఖర్చు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలతో కూడిన నివేదికను సీఈఓ సతీశ్ చదివి వినిపించారు. సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మినీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం, పీఏసీఎస్ ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేయాలని తీర్మాణం చేశారు. సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేలా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రుణాల చెల్లింపుల్లో జాప్యం వహించవద్దని సూచించారు. మండలంలో పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తామని నారాయణరెడ్డి తెలిపారు.